క్లుప్తంగా

గణేష్‌నగర్‌లో దీపారాధన



గణేష్‌నగర్‌లో హనుమాన్ చిత్రం చుట్టూ వెలిగించిన దీపాలు

సీతంపేట : గణేష్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో సీతంపేట గణేష్‌నగర్‌లో వినాయక ద్వాదశ రాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం దీపారాధన నిర్వహించారు. రంగు రంగుల ఉప్పుతో హనుమాన్ చిత్రాన్ని చిత్రించి చుట్టూ 501 దీపాలు వెలిగించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. యూత్ ప్రతినిధి ఉప్పాడ సన్నీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా కాళీ కాలభైరవుల కల్యాణం



శ్రీలలితా పీఠంలో కాళీ కాలభైరవుల కల్యాణ మహోత్సవంలో భక్తులు

సీతంపేట : అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో కాళీ కాలభైరవుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తకంగా కల్యాణం జరిపించారు. పీఠం దర్బారు హాల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై కాళీ కాలభైరవుల ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు వైభవునికి పౌర్ణమి పూజలు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాద్రపద పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

జానీ మాస్టర్‌ను కఠినంగా శిక్షించాలి

సీతమ్మధార : కొరియోగ్రాఫర్ షేక్ జానీ భాష (అలియాస్ జానీ మాస్టర్) లవ్ జిహాద్‌లో భాగంగా 21 సంవత్సరాల మహిళ డ్యాన్స్ మాస్టర్‌ను 2019 నుంచి అనేక సార్లు లైంగికంగా వేధించాడని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ఆరోపించారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ జానీ మాస్టర్, ఆయన భార్య అయేషా కలిసి ఆ మహిళా డ్యాన్స్ మాస్టర్‌ను చిత్రహింసలు పెడుతూ బలవంతంగా మతం మార్చుకుని, పెళ్లి చేసుకోవాలని తీవ్రంగా ఒత్తిడి చేసి లవ్ జిహాద్‌కు పాల్పడ్డారన్నారు. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

4 గంటలు ఆలస్యంగా వందేభారత్

తాటిచెట్లపాలెం: విశాఖలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–సికింద్రాబాద్ (20708) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరింది. ఈ రైలు అటునుంచి 4 గంటలు ఆలస్యంగా వచ్చిందని రైల్వే అధికారులు తెలిపారు.

అధ్వానంగా గ్రీన్‌బెల్ట్‌లు

- ఆక్రమించేసి వ్యాపారాల నిర్వహణ
- భారీ వృక్షాల నరికివేతతో పచ్చదనానికి తూట్లు
- దారుణంగా మారిన వాకర్స్ పార్కులు
- చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు



వివేకానంద వీధిని ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ఫెన్సింగ్ తొలగించిన దృశ్యం

కంచరపాలెం : జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రీన్‌బెల్ట్‌లు అధ్వానంగా మారాయి. తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం మీదుగా బిర్లా జంక్షన్ వరకు మూడు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారికి పక్కన గ్రీన్‌బెల్టును ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్రాంతంలో మొక్కలు పెంచకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో కొంత మంది వ్యాపారులు ఆ స్థలంలో పాగా వేశారు. వాకర్స్ పార్కులు శిథిలావస్థకు చేరుకోవడంతో అందులోని యంత్రాలు మూలకు చేరుతున్నాయి. గతంలో జీవీఎంసీ కమిషనర్ రూ.కోట్లు వెచ్చించి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రయాణికులు, పాదచారుల సౌలభ్యం కోసం ముఖ్యంగా పచ్చదనం కోసం ఈ గ్రీన్‌బెల్టులను ఏర్పాటు చేశారు. అటువంటి వాటిని కొంతమంది తమ చేతుల్లోకి తీసుకొని ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు. ఫలితంగా పచ్చదనం కనుమరుగవుతోంది. అదే విధంగా జీవీఎంసీ లక్ష్యం కూడా నీరుగారుతోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో గ్రీన్‌బెల్ట్‌లు, ఆరోగ్యవంతమైన సమాజం కోసం వాకర్స్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో వాకర్స్ పార్కులు, గ్రీన్‌బెల్ట్‌లకు రక్షణగా గ్రిల్స్ ఏర్పాటు పనులను కూటమి ప్రభుత్వం మధ్యలోనే ఆపేసింది. జోన్ – 5 అధికారులు వాకర్స్ పార్కుల రక్షణ, పచ్చదనాన్ని గాలికొదిలేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఆయా పార్కుల్లో వాకర్స్ జాడ కనిపించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి గ్రీన్‌బెల్ట్‌లను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

అన్నిచోట్లా అధ్వానంగా...

- కంచరపాలెం, ఊర్వశి కూడలి, తాటిచెట్లపాలెం, ఐటీఐ జంక్షన్ ప్రాంతాల్లోని గ్రీన్‌బెల్ట్ ప్రాంతాలు ఆటోలు, కార్లు, ఇతర వాహనాల మరమ్మతులతో నిండిపోతున్నాయి. ఏళ్ల తరబడి వాహనాలు తొలగించకపోవడంతో తుప్పు పట్టి రోడ్లపైనే అడ్డంగా పార్కింగ్ చేసి వదిలేశారు.
- ధర్మానగర్, తిక్కవానిపాలెం, ప్రాంతాల్లో గ్రీన్‌బెల్ట్‌లో చెట్ల కొమ్మల నరివేత పేరిట స్థానికులు భారీ వృక్షాలు తొలగిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.
- పచ్చదనం మాట ఎలా ఉన్నా భారీ వృక్షాలు నరికివేతతో వేడి వాతావరణం పెరిగిపోతోంది.
- రవీంద్రనగర్, దుర్గానగర్, రెడ్డి కంచరపాలెం, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ, దేవేంద్రనగర్ ప్రాంతాల్లో గ్రీన్‌బెల్టుల చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగులు సైతం కొందరు తీసేశారు. అనంతరం ఆ స్థలాలను వారికి అనుగుణంగా మార్చుకుని వ్యాపారాలు చేస్తున్నారు.
- కంచరపాలెం కూడలిలో గ్రీన్‌బెల్టును తొలగించి చేపలు, మాంసం విక్రయిస్తున్నారు. ఇక్కడ చెత్త సక్రమంగా తొలగించకపోవడంతో దుర్గంధభరితంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.
- కంచరపాలెం సన్‌రైజ్‌క్లబ్, షిర్డీ సాయి ధ్యాన మందిరం పక్కన గ్రీన్‌బెల్టులో వ్యాపారులు కొంతమంది ఇసుక, పిక్క, ఇటుక నిల్వ చేసి విక్రయిస్తున్నారు. వీటిని రవాణా చేసేందుకు రహదారిని ఆక్రమించేస్తున్నారు.
- బిర్లా జంక్షన్, కప్పరాడ, ఐటీఐ జంక్షన్ ప్రాంతాల్లో బస్టాప్‌ల పక్కన బడ్డీలు, ఇతర తోపుడుబళ్ల దుకాణాలు వెలిశాయి. ఇండస్ట్రియల్ ప్రాంతంలో గ్రీన్‌బెల్టు పూర్తిగా తొలగించి కార్ల షోరూమ్‌కు చెందిన వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు.
- జోగారావునగర్, ధర్మానగర్, గంగన్ననగర్ ప్రాంతాల గ్రీన్‌బెల్టు వెనకాల ఎక్కువగా తుక్కు, పాత సామగ్రి దుకాణాలు నడుస్తున్నాయి. దీనిలో భాగంగా ఆ దుకాణాలకు వచ్చే చెత్తను పెద్ద మూటలుగా కట్టి గ్రీన్‌బెల్టులో నిల్వ చేసే వ్యాపారాలు సాగిస్తున్నారు.



ధర్మానగర్ గ్రీన్‌బెల్టులో నరికేసిన చెట్లకొమ్మలు



గ్రీన్‌బెల్టులో శిథిలావస్థకు చేరిన ఓపెన్ జిమ్ పరికరాలు



తిక్కవానిపాలెం గ్రీన్‌బెల్టులో తొలగించిన భారీ వృక్షం



జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్టు ఎదుట ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలు

అధికారులు చోద్యం చూస్తున్నారు

ప్రభుత్వ స్థలంలో పచ్చదనాన్ని రూపుమాపి కొంత మంది తమ చేతుల్లోకి తీసుకుని వారికి ఇష్టం వచ్చినట్లు మార్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదో అర్థం కావడం లేదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ రహదారి పక్కన రూ.కోట్లు ఖర్చు పెట్టి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తే ప్రస్తుతం అక్కడ పచ్చదనం మచ్చుకైనా కనిపించడం లేదు.

– ఎస్.సురేష్‌కుమార్, అశోకనగర్, 55వ వార్డు

జీవీఎంసీ అధికారులు స్పందించాలి

గ్రీన్‌బెల్టులో పచ్చదనాన్ని తొలగిస్తున్నారు. వ్యాపారాలు చేస్తూ గ్రీన్‌బెల్టును ఆక్రమిస్తున్నారు. జాతీయ రహదారి సబ్‌వేలో వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో వాకర్స్ పార్కులు అధ్వానంగా మారాయి. వాకింగ్ చేయాలంటే ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి.

– కె.గణేష్‌కుమార్, రవీంద్రనగర్, 54వ వార్డు

వైభవంగా వినాయక కల్యాణం



ఆలయంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార : సిద్ధిబుద్ధి సమేత వినాయక కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లో గల త్రిముఖ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం చివరి రోజు గణపతికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద గురునాథ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, నల్లమిల్లి వెంకటరెడ్డి, శాంతి దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి, పీవీవీ సూరెడ్డి, సత్తి వీర రాఘవరెడ్డిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆలయ చైర్మన్ టి.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, బి.కె.నాయుడు, శంకరనాయుడు, సత్యనారాయణ, వెంకటలక్ష్మి, శైలుకుమారి, శ్రీదేవి, కోటేశ్వరమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

ప్రసాదరావు సస్పెన్షన్ అన్యాయం

సీతంపేట : సీతమ్మధార సాంఘిక సంక్షేమ వసతి గృహం – 2 వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.ప్రసాదరావును సస్పెండ్ చేయడం అన్యాయమని నవయాన బహుజన హక్కుల సంక్షేమ సంఘం ఖండించింది. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సంఘం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడారు. కుట్రపూరితంగా ఏఐఎస్ఎఫ్ సెక్రటరీ యు.నాగరాజు, ఎన్ఈ శ్రీను, హాస్టల్ వాచ్‌మన్ ఎం.అప్పారావు సహకారంతో ప్రసాదరావు లేని సమయంలో విద్యార్థుల చేత బలవంతంగా మరుగుదొడ్లు కడిగించి ఆ ఫొటోలను ఏఐఎస్ఎఫ్ వాళ్లకి పంపించారన్నారు. కుక్ భవానీ భర్త సుబ్రహ్మణ్యం ఫినాయిల్ కొనడానికి విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన విషయం ప్రసాదరావుకు తెలియదన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వాచ్‌మన్ అప్పారావు, కుక్ భవానీ, ఏఐఎస్ఎఫ్ నాగరాజు, శ్రీనులపై తగు చర్యలు తీసుకుని ప్రసాదరావుపై సస్పెన్షన్ ఎత్తి వేయాలని కోరారు. సమావేశంలో ఆర్.ప్రసాదరావు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బోసిపోయిన సీతమ్మధార రైతుబజార్

సందర్శించిన మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

సీతమ్మధార : రైతులు, వినియోగదారులు లేక సీతమ్మధార రైతుబజారు బోసిపోయింది. బజారుకు నాలుగేళ్లుగా కొనసాగిస్తున్న మంగళవారం సెలవుని జిల్లా అధికారులు రద్దు చేసి... రైతుబజార్ మంగళవారం యథావిధిగా పనిచేస్తుందని ప్రకటించారు. అయితే 2020 సంవత్సరం నుంచి అమలు చేస్తున్న సెలవును కొనసాగించాలని రైతులు కోరారు. రైతుబజార్‌కు ప్రతీ మంగళవారం సెలవు పాటించడంతో రైతులు, సిబ్బంది, వ్యాపారులు సొంత పనులు చేసుకునేవారు. ఈ నేపథ్యంలో ఆ సెలవు రద్దు చేయడంతో సీతమ్మధార రైతుబజార్‌కు పది మంది రైతులు మాత్రమే మంగళవారం వచ్చారు. ఉదయం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్ రైతుబజార్‌ని సందర్శించారు. రైతులు లేకపోవడంతో కొద్ది సేపు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబుతో మాట్లాడి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా యాసిన్ 'సాక్షి'తో మాట్లాడుతూ మంగళవారం సెలవు కొనసాగించాలా..? రద్దు చేయాలా..? ఆలోచిస్తామన్నారు. ఇప్పటికే సీతమ్మధార, కంచరపాలెం రైతుబజార్‌లు పరిశీలించినట్లు తెలిపారు. వారితోపాటు సహాయకుడు సతీష్ ఉన్నారు.



రైతులు, వినియోగాదారులు లేక బోసిపోయిన సీతమ్మధార రైతుబజార్

రైతుబజారులో సంతకాలు సేకరణ

సీతమ్మధార, కంచరపాలెం, నరసింహనగర్ (అక్కయ్యపాలెం) రైతుబజార్లలో మంగళవారం సెలవు కావాలని రైతులు సంతకాల సేకరణ చేపట్టారు. సీతమ్మధారలో 200 మంది మంగళవారం సెలవు కావాలని సంతకాలు చేశారు. సెలవు వద్దని 13 మంది కోరారు. నరసింహనగర్ (అక్కయ్యపాలెం)లో 130 మంది సెలవు కావాలని, సెలవు రద్దు చేయాలని పది మంది సంతకాలు చేశారు. కంచరపాలెం రైతుబజార్‌లో 120 మంది సెలవు కావాలని, పది మంది వద్దని సంతకాలు చేశారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



శాంతినగర్ పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో మాత్రలు మింగిస్తున్న ఆశ కార్యకర్త



శంకువానిపాలెం అంగనవాడీ కేంద్రంలో మాత్రలు మింగిస్తున్న ఏఎన్ఎం, ఆశ కార్యకర్త

కంచరపాలెం : పిల్లల ఆరోగ్యానికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సూచించారు. 46వ వార్డు శాంతినగర్, లక్ష్మీనారాయణపురం పరిధిలో గల ప్రాథమిక పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మంగళవారం ఆయన మాత్రలు వేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింగరావు, గోవింద్, శివ, జానీ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీతంపేట : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ స్కూల్స్, అంగనవాడీ కేంద్రాల్లో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లో గల హైస్కూల్, ప్రైమరీ స్కూల్, అంగనవాడీ కేంద్రంలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం తర్వాత ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, అంగనవాడీ టీచర్లు మాత్రలు మింగించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

- విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్, అంగనవాడీ కేంద్రాల్లో వైద్యాధికారి డాక్టర్ సుధీర్ పర్యవేక్షణలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అలాగే నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ మనోజ్ పర్యవేక్షణలో అన్ని స్కూల్స్, అంగనవాడీ కేంద్రాల్లో మాత్రలు మింగించారు.

మురళీనగర్ : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మురళీనగర్ పరిసరాల్లోని పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేశారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.హేమలత 482 మందికి, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఎస్‌పీ నాయుడు 320 మందికి, ఏఎస్సార్‌నగర్‌లోని కే.కాలనీ ఉన్నత పాఠశాలలో 275 మందికి, బర్మా కాంపు పాఠశాలలో 215 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అంగన్‌వాడీ టీచర్ మౌలా బీబీ, ఏఎన్ఎం స్రవంతి పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా ప్రారంభం



అధికారులు, సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల స్టేషన్లు, రైల్వే కాలనీలు, ప్రాంగణాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు, డీఆర్‌ఎం కార్యాలయం వద్ద స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేపట్టారు.

కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహు (ఆపరేషన్స్), సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), సీనియర్ డివిజినల్ మెకానికల్ ఇంజినీర్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ ప్రవీణ్‌భట్, డివిజినల్ మెకానికల్ ఇంజినీర్ నరేంద్రకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పల్గొన్నారు.

గోతుల పూడ్చివేత ప్రారంభం



సత్యం జంక్షన్ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్తున్న రోడ్డులో పనులు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార : నగరంలోని జాతీయ రహదారిపై గోతులకు ప్యాచ్‌వర్కు పనులు మంగళవారం ప్రారంభించారు. సత్యం జంక్షన్ నుంచి మద్దిలపాలెం వెళ్లే మార్గంలో పనులు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గోతులమయమయ్యాయి. పెద్దపెద్ద గుంతల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై సాక్షిలో గత నెలలో కథనం కూడా ప్రచురితమైంది. ఎట్టకేలకు స్పందించిన అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే కొంత వరకు ప్రమాదాలు తగ్గుతాయని పలువురు అంటున్నారు.

నేటి నుంచి చండీ సహిత సుదర్శన యాగం

ఆరిలోవ: లోక కల్యాణం కోసం బుధవారం నుంచి ఐదు రోజులు పాటు చండీ సహిత సుదర్శన యాగం నిర్వహించనున్నట్లు బాలభాను అర్చక, పురోహిత సంఘం అధ్యక్షుడు జోస్యుల కామేశ్వర శర్మ తెలిపారు. తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయంలో సంఘం ప్రతినిధులు మంగళవారం నిర్వహించిన సమావేశంలో యాగానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటగరువు ఎర్నిదుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 18 నుంచి 22 వరకు యాగం జరుగుతుందన్నారు.

ప్రతిరోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, తులసీ ఆరాధన, సూర్య నమస్కారాలు, చండీ పారాయణం, చండీ హోమం, రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు జరిపిస్తామన్నారు. అందులో భాగంగా 18న సీతారామ కల్యాణం, 19న వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, 20న శివపార్వతుల కల్యాణం, 21న శ్రీనివాస కల్యాణం, 22న ఆదివారం సూర్యనారాయణ స్వామి కల్యాణం జరిపించనున్నట్లు తెలిపారు. సంఘం కార్యదర్శి మావుదూరు కిశోర్ శర్మ మాట్లాడుతూ భక్తులను భాగస్వాములను చేసే ఈ యాగంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గౌరవాధ్యక్షుడు ఆరవెల్లి సూర్యప్రకాశరావు, కోశాధికారి పి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి శర్మ, ఎం.సంపత్ కుమార్ శర్మ, కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రధాన అర్చకుడు కుమార్ శర్మ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలభాను అర్చక సంఘం ప్రతినిధులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పనులు

సీతమ్మధార : స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు శరగవేగంగా జరుగుతున్నాయి. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి బస్టాప్ సమీపంలో గల పుట్‌పాత్ మీద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం సిబ్బంది దిమ్మ కడుతున్నారు. పౌర సరఫరాల సంస్థ ఇప్పటికే సీతమ్మధార ప్రెస్‌క్లబ్ పక్కన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్న స్థలంలో ప్రస్తుతం ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వుంది. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ని తహసీల్దార్ కార్యాలయం ప్రధాన గేటు పక్కన ఫుట్‌పాత్ మీదకు తరలించనున్నారు. ఇక్కడ రెండో పెట్రోల్ బంక్ వస్తే వాహన చోదకులకు మరింత సౌలభ్యంగా వుంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వమే స్వయంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తే కొలతల విషయంలో కచ్చితత్వం వుంటుందని, కల్తీ భయం ఉండదని ప్రజలు భావించే అవకాశాలున్నాయి. త్వరలోనే ఇక్కడ పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు ప్రారంభిస్తారని తెలిసింది.



ఫుట్‌పాత్ మీద పనిచేస్తున్న సిబ్బంది

ప్రపంచ ఓజోన్ పరిరక్షణ ర్యాలీ



ర్యాలీలో ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్టూడెంట్స్ సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజులా ర్యాలీ, సెమినార్ ప్రారంభించారు. కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి సంతోషి, అనూష, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ శరణ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అరుణపద్మ, డాక్టర్ బి.కల్యాణరాము, పీజీ కెమిస్ట్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ హైమావతి తదితరులు పాల్గొని ఓజోన్ పరిరక్షణ దినోత్సవంపై మాట్లాడారు.